సాక్షి ఒడిశా

శుక్రవారం । 4 । జూలై । 2025



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం గురువారం లెక్కించారు. ఇందులో నగదు రూ.2,20,243లు, వెండి 4గ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



యువరాజుకు కానుకలు

జయపూర్ యువరాజుకు గిరిజనులు కానుకలు ఇచ్చారు. ఎన్నో దశాబ్దాల తర్వాత మోతీమహల్ తెరిచారు.

- 8లో



జనజీవన అస్తవ్యస్తం

జయపూర్ డివిజన్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. జనజీవనం అస్తవ్యస్తమైంది.

- 8లో

న్యూస్‌రీల్

వెదజల్లుతున్న దుర్గంధం



అధ్వానంగా ఉన్న మార్కెట్

కొరాపుట్: నబరంగ్‌పూర్ జిల్లా కేంద్రంలోని డైలీ మార్కెట్ వద్ద తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. బస్టాండ్ సమీపంలో రైతు బజార్ పేరిట ప్రభుత్వం దీనిని ఏర్పాటు చేసింది. ఇదే ప్రధాన మార్కెట్ కావడంలో నిత్యం వందల సంఖ్యలో కొనుగోలుదారులు వస్తుంటారు. అంతేకాకుండా ఆంధ్ర, చత్తీస్‌ఘఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణల నుంచి అనేక వస్తువులు వస్తుంటాయి. ఇక్కడ నుంచి అనేక ఉత్పత్తులు వెళ్తుంటాయి. అటువంటి మార్కెట్‌లో పారిశుద్ధ్యం తీవ్రంగా లోపించింది. ఎక్కడికక్కడే మురికి కుంటలు ఏర్పడ్డాయి. వాటిని శుభ్రం చేసే నాథుడే కరువయ్యాడు. మురికికూపాల పక్కన గిరిజనులు తమ ఉత్పత్తులు విక్రయాలు చేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం రోజుకి రెండు సార్లు మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేయాలి. కానీ అలా జరగడం లేదు. చేసేది ఏమీ లేక, చెప్తే వినేవారు లేక ప్రజలు, వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ద్వారం.. సుగంధ భరితం



శోభాయమాన నక్కొచౌణ ద్వారం

భువనేశ్వర్: శ్రీ గుండిచా ఆలయం నక్కొచౌణ ద్వారం శోభాయమానంగా సుగంధం విరజిమ్ముతోంది. మారు రథ యాత్ర (బహుడా) రోజున బలభద్రుడు, దేవీ సుభద్ర, శ్రీ జగన్నాథునితో చక్ర రాజు సుదర్శనుడు మూల విరాట్లు ఈ ద్వారం గుండా వెలుపలికి విచ్చేస్తారు. యాత్రలో భాగంగా అడపా మండపంపై పూజలు అందుకున్న దేవతలు తిరిగి శ్రీ మందిరంలో రత్న వేదిక చేరేందుకు వరుస క్రమంలో (గొట్టి పొహండి) బయటకు తరలి వచ్చి రథాలపై ఆసీనులు అవుతారు. అనంతరం మారు యాత్రకు రథాలు బయల్దేరుతాయి. హీరా పంచమి రోజున శ్రీదేవి కూడా ఈ ద్వారం గుండా తిరిగి వస్తుంది. నక్కొచౌణా ద్వారం పైభాగం మధ్యలో శ్రీ మహాలక్ష్మి ఉంటుంది. ద్వారం ఎడమ వైపున బ్రహ్మ, కుడి వైపున మహా దేవుడు ఉంటాడు. బ్రహ్మ మరియు శివుని పైన, నవ గ్రహాలు కూడా ఉంటాయి. బహుడా యాత్ర కోసం ఈ ద్వారం ముస్తాబు అవుతోంది. భారీ రంగవల్లలతో యాత్ర శోభ రంగరించుకుంటుంది.

దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ



వీల్‌చైర్లను పంపిణీ చేస్తున్న దృశ్యం

రాయగడ: జిల్లాలోని గుడారిలో కలెక్టర్ ఫరూల్ పట్వారీ ఆదేశాల మేరకు జిల్లా సామాజిక సురక్షా అధికారి రంజిత బెహర ఆధ్వర్యంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో దివ్యాంగులకు వీల్‌చైర్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. అదేవిధంగా వైద్యుల సమక్షంలో నిర్వహించిన పరీక్షల్లో వివిధ సమస్యలతో ఉన్న దివ్యాంగులకు గుర్తించి వారికి ప్రభుత్వం ద్వారా అందాల్సిన పథకాలు అందేలా పేర్లు నమోదు చేశారు. కార్యక్రమంలో పద్మపూర్ సామాజిక సురక్షా అధికారి సిగ్నమయి బారిక్, పీఏ మనోజ్ కుమార్ మిశాల్, అనీల్ గౌడొ తదితరులు పాల్గొన్నారు.

భయపెడుతున్న వరద

కొరాపుట్:

కొరాపుట్, నబరంగ్‌పూర్ జిల్లాలో నదులు కట్టలు తెంచుకున్నాయి. గురువారం రాష్ట్రంలో అత్యధిక వర్షపాతంగా కొరాపుట్ జిల్లా కొట్‌పాడ్‌లో 152 మిల్లీమీటర్లు పడింది. ఈ విషయం రాష్ట్ర వాతావరణ శాఖ ప్రత్యేక బులెటిన్‌లో ప్రకటించింది. లమ్తాపుట్ సమితిలో ఆంధ్రా–ఒడిశా ఉమ్మడి జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాచ్‌ఖండ్‌లో డీ డ్యాం లో 6,7 గేట్లు ఎత్తేశారు. ఈ రెండు గేట్ల నుంచి క్యూసెక్కుల నీటిని చిత్రకొండ జలపాతానికి వదిలారు. డ్యామ్ సామర్థ్యం 2,590 అడుగులు కాగా అక్కడ 2,588 అడుగుల వరకు నీటి పరిమాణం వచ్చింది. గత ఐదు రోజుల్లో ఈ బేసిన్‌లో 262 మిల్లీ మీటర్ల వర్షం పడింది. దీంతో నీటిని వదలాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం డ్యామ్‌లో 2,586.5 అడుగుల నీరు ఉంది.

రైతుల కష్టాలు

కుంద్రా సమితిలో పొలాల్లో నీరు నిల్వ ఉండిపోయింది. 25 ఎకరాల పంట పొలంలో ధాన్యం మొలకలెత్తాయి. ఈ రైతులకు ధాన్యం కొనడానికి ఇప్పటికే ప్రభుత్వం టోకెన్లు ఇచ్చింది. ఇప్పుడు ఆ ధాన్యం ఏం చేయాలో తెలియక రైతులు రోదిస్తున్నారు. లమ్తాపుట్ సమితిలో కల్వర్టు వద్ద నీరు ప్రవహిస్తోంది. నబరంగ్‌పూర్ జిల్లా ఉమ్మర్ కోట్ సమీపం డొడ్ర వద్ద రోడ్డు తెగి వర్షం నీరు పారుతోంది. ఈ ప్రాంతాన్ని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు రమేష్ సాహు సందర్శించారు. పరిస్థితి మంత్రుల దృష్టికి తీసుకొని వెళ్లారు.



మాచ్‌ఖండ్‌లో డీ డ్యామ్ గేట్లు ఎత్తేసిన దృశ్యం

కొరాపుట్ జిల్లాలో 47 ఇళ్లు ధ్వంసం

గురువారం ఉదయానికి కొరాపుట్ జిల్లాలో వర్షాల వల్ల 47 ఇళ్లు కూలి పోయాయి. బాధిత ప్రజలు తమ వద్దకు ప్రభుత్వ సిబ్బంది వచ్చి పరిహారాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. నందపూర్ సమితి సెమలా వద్ద రోడ్డు పై భారీవృక్షం కూలి పోయింది. దీంతో రాకపోకలు నిలిచిపోయాయి. నందపూర్ అగ్ని మాపక బృందం వచ్చినప్పటికీ భారీ వృక్షం కావడంతో తొలగించడం కష్టమైంది. దీంతో స్థానిక గిరిజనుల సాయంతో చెట్టును తొలగించారు. నబరంగ్‌పూర్ జిల్లా ఖాతీ గుడకి వెళ్లే మార్గంలో లమ్తా గుడ వద్ద కల్వర్టు మునిగి పోయింది. దీంతో ఇంద్రావతి నుండి జిల్లా కేంద్రానికి రాకపోకలు నిలిచి పోయాయి.



కుంద్రాలో పొలంలో కుళ్లిపోయిన ధాన్యం కంకులు



నందపూర్ సమితిలో రోడ్డు మీద కూలిన చెట్టు



నందపూర్‌లో కూలిన ఇల్లు



లమ్తాపుట్‌లో ప్రమాద స్థితిలో కల్వర్టు దాటుతున్న వాహనదారులు

బహుడాకు రథాలు సిద్ధం



శ్రీ గుండిచా నక్కొచౌణ ద్వారం ఆవరణలో మూడు రథాలు

భువనేశ్వర్: పూరీ శ్రీ జగన్నాథుని రథయాత్ర ఆద్యంతాలు యుద్ధ సన్నాహమే. భక్తి శ్రద్ధల మేళవింపుతో స్వామి యాత్ర అత్యంత ఉత్సాహ భరితంగా కొనసాగుతుంది. స్వామి భక్తులు విభిన్నం. భగవంతుని అపురూప దర్శనం కోసం పరిమితం కాకుండా భక్తి భావోద్వేగంతో స్వామి యాత్రలో అడుగడుగున ప్రత్యక్ష పాత్రధారులుగా పాలుపంచుకుంటారు. అగణిత భక్త జనం మధ్య స్వామి ఆప్యాయ అనురాగాలతో యాత్రలో పాల్గొంటాడని వీరి విశ్వాసం. ఇదే స్ఫూర్తితో శ్రీ మందిరం సింహ ద్వారం ఆవరణ నుంచి శ్రీ గుండిచా నక్కొ చౌణ ద్వారం ఆవరణకు యాంత్రిక, సాంకేతిక వినియోగం లేకుండా 3 భారీ రథాల్ని సురక్షితంగా గమ్యం చేర్చారు. ఇదే తరహాలో మారు రథ యాత్రకు 3 రథాలు సిద్ధమయ్యాయి. వర్షం ప్రభావంతో బుధవారం నాడు ప్రారంభించిన రథాల మలుపు కార్యక్రమం పాక్షికంగా పూర్తయ్యింది. శ్రీ జగన్నాథుని నందిఘోష్ రథం లాగే సమయానికి కుండపోత వాన కురవడంతో వాయిదా పడింది. మరునాడు గురువారం ఉదయం నందిఘోష్ రథాన్ని లాగి శ్రీ గుండిచా నక్కొచౌణ ద్వారం ముంగిటకు పోలీసు జవానులు చేర్చారు.



జగన్నాథ రథ చక్రాలు కదిలేది ఇలా..



నందిఘోష్ రథం మలుపు తిప్పుతున్న రక్షక జవానులు

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి

భువనేశ్వర్: రాష్ట్రంలో బుధవారం వేర్వేరు రహదారి దుర్ఘటనల్లో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. తండ్రి అంత్యక్రియలకు వెళ్తుండగా దంపతులు, విధులు ముగించుకుని ఇంటికి వెళ్తుండగా మహిళా హోమ్ గార్డు, స్కూటరుని ట్రక్కున ఢీకొన్న దుర్ఘటనలో యువకుడు దుర్మరణం పాలయ్యారు. ఖుర్దా–బొలంగీర్ 57వ నంబరు జాతీయ రహదారిపై నిలకడగా నిలిచి ఉన్న ట్రక్కుని కారు ఢీకొన్న ప్రమాదంలో మృతుని కొడుకు, కోడలు మృతి చెందారు. తండ్రి అంత్యక్రియలు నిర్వహించేందుకు భార్యతో కలిసి వెళ్తుండగా కారు ట్రక్కుని ఢీకొనడంతో దంపతులు ఘటన స్థలంలోనే ప్రాణాలు కోల్పోయారు. బౌధ్ జిల్లా రంభికట టోల్‌గేట్ సమీపం నువాపడా కూడలి ప్రాంతంలో ఈ విషాదం చోటు చేసుకుంది. మృతులు నయాగఢ్ గొణియా ప్రాంతానికి చెందిన రాజ్‌కిషోర్, మీనాక్షి సాహుగా గుర్తించారు. మరో దుర్ఘటనలో ట్రక్కు దూసుకెళ్లి మహిళా హోమ్ గార్డు దుర్మరణం పాలైంది. సైకిల్‌పై వెళ్తున్న మహిళా హోమ్ గార్డుపై ట్రక్కు దూసుకుని పోవడంతో దుర్మరణం పాలైంది. కటక్ నగరం ఛత్ర బజార్ అర్బన్ హట్ సమీపంలో ట్రక్కు హోం గార్డుపైకి దూసుకెళ్లింది. మృతురాలు మనోరమ పండాగా గుర్తించారు. ఆమె మాల్ గోదాం పోలీస్ ఠాణాలో హోమ్ గార్డుగా పనిచేస్తోంది. ఆమె తన విధిని ముగించుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. బస్సు స్కూటర్‌ను ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. కటక్ బాదంబాడి నుంచి లింక్ రోడ్ వెళ్తున్న స్కూటీని లింక్ రోడ్ మధుపట్న కూడలి వద్ద బస్సు స్కూటర్‌ను ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. మృతుని ఆచూకీ తెలియాల్సి ఉంది.



57వ నంబరు జాతీయ రహదారిపై ట్రక్కుని ఢీకొన్న కారు

రాయగడలో మంత్రి సూర్యవంశీ పర్యటన నేడు

రాయగడ: రాష్ట్ర ఉన్నత విద్యా, క్రీడలు, యూత్ సర్వీసెస్ శాఖల మంత్రి సూర్యవంశీ సూరజ్ రాయగడలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు ఉదయం 8 గంటలకు రాయగడకు చేరుకుని సద్భావన,



మంత్రి సూర్యవంశీ

స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను సందర్శిస్తారు. అనంతరం స్థానిక అటానమస్ కళాశాల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జరగనున్న ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవుతారు. తదుపరి 12.30 గంటలకు స్థానిక సిరిగుడలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమవుతారు. మధ్యాహ్నం 3.45 గంటలకు స్థానిక బిజూ పట్నాయక్ ఆడిటోరియంలో జరిగే సమావేశంలో పాల్గొంటారు.

క్రీడా రత్నాలు

భువనేశ్వర్: ప్రపంచ క్రీడా వేదికపై ఒడిశా పోలీసు క్రీడాకారులు చరిత్ర సృష్టించారు. అమెరికా బర్మింగ్ హామ్‌లో జరిగిన ప్రపంచ పోలీస్ అండ్ ఫైర్ గేమ్స్ 2025లో కరాటే, 800 మీటర్లు, 1500 మీటర్లు పందెంలో బంగారు పతకాలు సాధించారు. మరిన్ని తేజోవంతమైన విజయాలతో వీరి భవిష్యత్ ఉజ్వలం కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి అభినందించారు. కరాటే (64 కిలోల లోపు) విభాగంలో కానిస్టేబుల్ భగవాన్ రెడ్డి, పురుషుల (84 కిలోల లోపు) కరాటే పోటీలో కానిస్టేబుల్ సుమన్ శేఖర్ దాస్ బంగారు పతకాలు సాధించారు. మహిళల 1500 మీటర్ల రేసులో కానిస్టేబుల్ సుష్మితా టిగ్గా బంగారు పతకాన్ని గెలుచుకుంది. ఆమె గతంలో 800 మీటర్ల రేసులో రజత పతకాన్ని గెలుచుకుంది. పురుషుల 1500 మీటర్లు మరియు 800 మీటర్ల రేసులో కానిస్టేబుల్ అశోక్ దండసేన వరుగా 2 బంగారు పతకాలు చేజిక్కించుకున్నాడు.



భగవాన్ రెడ్డి



సుష్మిత టిగ్గా



అశోక్ దండసేన



సుమన్ శేఖర్ దాస్

తెలంగాణ పేలుడులో నబరంగ్‌పూర్ వాసులు



సంగారెడ్డి రసాయన పరిశ్రమ పేలుడు కోసం వాకబు చేస్తున్న గిరిజనులు

కొరాపుట్: తెలంగాణ రాష్ట్రంలో జరిగిన పేలుడులో ఇద్దరు జిల్లా వాసులు మృతి చెందారు. గురువారం నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితిలో అనేక గ్రామాలకు ఈ సమాచారం వచ్చింది. సంగారెడ్డి జిల్లా పాశమైలవరం కెమికల్ ఫ్యాక్టరీలో పేలుడు జరిగి సుమారు 45 మంది మృతి చెందారు. ఇదే పరిశ్రమలో నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం సమితి కొడాబెట్ గ్రామానికి చెందిన రమేష్ గౌడ్ (30), చైతు బోత్ర (31) లు మృతి చెందారని సమాచారం వచ్చింది. సమితిలో కోడాబెట్ గ్రామంతో పాటు బుబాలిబెధ, పరసాల గ్రామాలకు చెందిన అనేక మంది యువకులు ఇదే పరిశ్రమలో కార్మికులుగా పనిచేస్తున్నారు. కొడాబెట్ గ్రామానికి చెందిన ఏడుగురు యువకులలో ఇద్దరు మాత్రమే పనికి వెళ్లారు. వారి మృతదేహాలను అక్కడ మార్చురీలో ఉంచినట్లు స్థానిక పోలీసులకు సమాచారం వచ్చింది. మృతుల బంధువుల డీఎన్ఏ కావాలని సమాచారం రాగా ఇక్కడ నుండి కొందరు యువకులు సంగారెడ్డి బయలు దేరి వెళ్లారు.



తమ కుమారుల మృతదేహాలను తెప్పించాలని విజ్ఞప్తి చేస్తున్న దృశ్యం



బాధిత కుటుంబం బయట సమీప గ్రామాల ప్రజలు



బాధిత కుటుంబ సభ్యులు

కిరండోల్–కొత్తవలస రైల్వేలైన్ పునరుద్ధరణ



గురువారం సాయంత్రానికి జరుగుతున్న పనులు

కొరాపుట్: కొత్తవలస–కిరండోల్ రైల్వే లైన్ పునరుద్ధరణ కోసం భారీ ఎత్తున్న రైల్వే సిబ్బంది మోహరించారు. బుధవారం కొరాపుట్–జయపూర్ రైల్వే స్టేషన్ల మార్గంలో జర్తి–మాలిగుడల మధ్య పెద్ద ఎత్తున మట్టి చరియలు ట్రాక్ మీదకు చొచ్చుకువచ్చిన విషయం పాఠకులకు తెలిసిందే. బుధవారం సాయంత్రం నుంచి గురువారం రాత్రి వరకు రైల్వే సిబ్బంది మట్టిని తొలగించడానికి పనులు చేస్తున్నారు. కురుస్తున్న భారీ వర్షాలు పనులకు అడ్డంకిగా మారాయి. 13 హెవీ జేసీబీలు, పదుల సంఖ్యలో ట్రక్‌లు, సుమారు 300 మందికి పైగా కార్మికులు ఈ పనులలో నిమగ్నమయ్యారు. రాళ్లు తొలగిస్తున్నప్పటికీ వర్షం నీరు వస్తుండడంతో పనులు మరింత ఆలస్యం అవుతున్నాయి. రాయగడ రైల్వే డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ సంఘటన స్థలంలో టెంట్ వేసుకొని మకాం వేశారు. రాత్రింబవళ్లు డీఆర్ఎం అక్కడే ఉండడంతో పనులు నిరాటంకంగా జరుగుతున్నాయి.ఇప్పటికే జగదల్‌పూర్–భువనేశ్వర్, జగదల్‌పూర్–రౌర్కెలా, కిరండోల్– విశాఖ పట్నం ప్యాసింజర్, కిరండోల్–విశాఖపట్నం నైట్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేశారు. గురువారం కూడా కిరండోల్–కొరాపుట్‌ల మధ్య రైళ్లు నడవలేదు. కొరాపుట్ రైల్వే స్టేషన్ నుంచి కొన్ని రైళ్లు నడుపుతున్నారు. శుక్రవారం ఉదయానికి పునరుద్ధరణ పనులు పూర్తవ్వవచ్చని రాయగడ డీఆర్ఎం అమితాబ్ సింఘాల్ ప్రకటించారు.



ట్రాక్‌పై చొచ్చుకు వచ్చిన మట్టి



మట్టిని తొలగిస్తున్న వాహనాలు



తొలగిస్తున్న కొద్దీ కిందకు వస్తున్న వర్షపు నీరు

క్లుప్తంగా

రాష్ట్ర గవర్నర్‌తో కలిసిన మోంటానా ప్రతినిధి బృందం



రాజ్ భవన్‌లో గవర్నర్‌ని కలిసిన మోంటానా ప్రతినిధి బృందం

భువనేశ్వర్: భారత దేశ ఘనమైన సంస్కృతి, కళలు, సామాజిక పురోగతి రంగాల్లో వైవిధ్యాన్ని అన్వేషించాలని అమెరికాలో మోంటానా ప్రతినిధి బృందాన్ని గవర్నర్ కోరారు. ట్రెక్ 2025 కార్యక్రమం కింద 10 మంది సభ్యుల మోంటానా ప్రతినిధి బృందం గురువారం రాజ్ భవన్‌లో రాష్ట్ర గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటిని కలిసింది. ఇలాంటి సందర్శనలు వివిధ దేశాల ప్రజల మధ్య మెరుగైన అవగాహనను పెంపొందించడానికి సహాయపడతాయని గవర్నరు అన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి బృందం సభ్యులు రాజ్ భవన్ సందర్శించారు.

జన జీవనం అస్తవ్యస్తం



బొయిపరిగుడ సమితి టెసపనకగోకులపాదర్ మార్గంలో వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టు

జయపురం: జయపురం సబ్‌డివిజన్‌లో భారీ వర్షాలు పడుతుండగా జయపురంలో అత్యధికంగా 73.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. బొయిపరిగుడ సమితిలో 73 మిల్లీ మీటర్ల వర్షం నమోదు కాగా జయపురం, బొయిపరిగుడ సమితిలో జన జీవనం అస్తవ్యస్తమైంది. జయపురం పట్టణంలోని పలు వీధుల్లో వరద నీరు మోకాలు ఎత్తున పారింది. పదికిపైగా ఇళ్లు నేలమట్టమయ్యాయి. మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ బి.సునీత ముంపుకు లోనైన ప్రాంతాలను తిరిగి పరిస్థితిని సమీక్షించారు. విజయవాడ– రాంచీ 326 జాతీయ రహదారిలో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గుప్తేశ్వర వెళ్లే రహదారిలో రోడ్డు ధ్వంసమైంది.

పేకాట శిబిరంలో రూ.3.66 లక్షలు స్వాధీనం

పర్లాకిమిడి: గుమ్మాబ్లాక్ కుర్లండ గ్రామశివార్లలో జీడితోటలో పేకాట శిబిరంపై పర్లాకిమిడి ఆదర్శపోలీసు స్టేషన్ సిబ్బంది దాడిచేసి ఏడుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.3.66 లక్షలు, 30 టూవీలర్స్ బైక్‌లు, 5 ప్యాకెట్ల పేకలు స్వాధీనం చేసుకున్నట్టు సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్ తెలియజేశారు. ఏడుగురు నిందితులపై కేసును నమోదు చేశారు.

బ్యాగ్ అప్పగింత



ప్రయాణికుని బ్యాగ్‌ను అప్పగించిన టికెటు తనిఖీ అధికారి

భువనేశ్వర్: తొందరపాటులో రైలులో బ్యాగ్‌ని వదిలి దిగిపోయిన ప్రయాణికునికి టికెటు తనిఖీ అధికారి సురక్షితంగా అందజేశారు. గురువారం సిలిగురి (గువాహతి) – కోయంబత్తూర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికుడు రాజా సర్కార్ విలువైన సామగ్రితో నిండిన బ్యాగును మరిచిపోయారు. ఖుర్దారోడ్ మండలం చీఫ్ టికెట్ ఇనస్పెక్టర్ (సీటీఐ) లక్ష్మీధర మహంతి బ్యాగును ప్రయాణికునికి అప్పగించారు. ప్రయాణికుని ఫిర్యాదు అందడంతో చేపట్టిన సత్వర గాలింపుతో ఇది సాధ్యమైందని సీటీఐ వివరించారు. మండల కమర్షియల్ కంట్రోల్, రక్షక దళం వర్గాల సమన్వయంతో ప్రయాణికునికి సామగ్రి సురక్షితంగా అందజేశామన్నారు.

కలెక్టర్‌కు కృతజ్ఞతలు



మహిళతో మాట్లాడుతున్న కలెక్టర్

కొరాపుట్: కొరాపుట్ జిల్లాలో ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు (మండీలు) నిర్వహణ ఇచ్చినందుకు మహిళలు కృతజ్ఞతలు తెలియజేశారు. గురువారం సాయంత్రం కొరాపుట్ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌కి రాణీ లక్ష్మీభాయి స్వయం సహాయక బృందం తరలివెళ్లింది. తమకు మండీలు నిర్వహణ బాధ్యత అప్పగించినందుకు కలెక్టర్ వి.కీర్తి వాసన్‌కి అభినందించారు. కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ ఈ ఏడాది జూన్ 2 నుంచి 30వ తేదీ వరకు మండీలు నిర్వహించామన్నారు. కొరాపుట్ జిల్లాలో 14.5 లక్షల క్వింటాల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసిందన్నారు. కలహండి, బలంగీర్ జిల్లాల నుంచి వచ్చిన మిల్లర్లు ఈ ధాన్యం కొనుగోలు చేశారన్నారు. ఈ మండీల నిర్వహణ ఎస్‌హెచ్‌జీ, పానీ పంచాయతీ, ల్యాంప్స్‌కి అప్పగించామని కలెక్టర్ ప్రకటించారు.

ఉత్తర ఒడిశాలో వరద ఉధృతి

● ఏరియల్ సర్వే నిర్వహించిన ఉప ముఖ్యమంత్రి

భువనేశ్వర్: ఉత్తర ఒడిశాలో ఎడతెరిపి లేని వానలతో పలు నదులు ఉప్పొంగాయి. జనావాసాలు వరద నీటిలో మునిగాయి. ఒడ్రాఫ్, తదితర వర్గాల సకాల సహాయ, సహకారాలతో చిరు ప్రమాదాలు మినహా అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. గురువారం ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించారు. ప్రధానంగా బాలాసోర్ జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పరిస్థితిని పర్యవేక్షించారు. భోగొరాయి, బలియాపాల్, బొస్తా, జలేశ్వర్, బాలాసోర్ సదర్, రెముణ తదితర ప్రాంతాల్ని సందర్శించారు. ఈ జిల్లాలోని 6 మండలాల్లో 154 గ్రామాలు, జలేశ్వర్ మునిసిపాలిటీలోని 8 వార్డులు వరద నీటితో ప్రభావితమైనట్లు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ప్రజలను సురక్షిత ప్రదేశాలకు తరలించి ఆశ్రయంతోపాటు ఆహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. సహాయక, పునరుద్ధరణ కార్యకలాపాల కోసం ఒడ్రాఫ్, అగ్నిమాపక దళాలను నియమించారు.



భోగొరాయి ప్రాంతంలో సువర్ణరేఖ నది వరద



బాలాసోర్ వరద ప్రాంతాలను ఏరియల్ సర్వేలో పర్యవేక్షిస్తున్న ఉప ముఖ్యమంత్రి

కెంజొహర్ జిల్లాలో వరద ఉధృతి

కెంజొహర్ జిల్లా జోడా కాన్‌పూర్ ప్రాంతంలో తాత్కాలిక మట్టి కట్ట తెగడంతో వరద నీరు జనావాస ప్రాంతాల్లోకి వెళ్లింది. ఎటువంటి హాని జరగకుండా సత్వర చర్యలు చేపట్టినట్లు ఆనకట్ట చీఫ్ ఇంజినీర్ తెలిపారు.



భోగొరాయి ప్రాంతంలో సువర్ణరేఖ నది వరద



బాలాసోర్ ప్రాంతంలో వరద ఉధృతి

కొరాపుట్ జిల్లాలకు సముచిత స్థానం



ప్రసంగిస్తున్న సీఎం మోహన్‌చరణ్ మాఝి

● సీఎం మోహన్‌చరణ్ మాఝి

కొరాపుట్: అవిభక్త కొరాపుట్ జిల్లాల ప్రజలకు రాజధానిలో సుముచిత స్థానం ఉంటుందని సీఎం మోహన్‌చరణ్ మాఝి అన్నారు. గురువారం రాజధానిలోని శబరి సాంస్కృతి సంసద్ సంస్థ ద్వారా నిర్మితమైన సాహిద్ భవన్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అవిభక్త కొరాపుట్ జిల్లాలైన కొరాపుట్, నబరంగ్‌పూర్, రాయగడ, మల్కన్‌గిరి జిల్లాల ప్రజలకు ఈ భవనం ఎన్నోవిధాలుగా ఉపయెగపడుతుందన్నారు. శబరి అంటే సవర అనే పదం నుంచి మార్పు అన్నారు. అటువంటి శబరి పేరు భవనానికి ఉండడం గర్వకారణమని పేర్కొన్నారు. అనేక గిరిజన సంస్కృతులు, కళలకు ఈ జిల్లాలు నిలయాలని కొనియాడారు. కార్యక్రమంలో మంత్రి నిత్యానంద గోండో, ఎంపీలు మున్నాఖాన్, బలభద్ర మఝి, మాజీ మంత్రులు రమేష్ చంద్ర మఝి, జగన్నాథ సారక, ఎమ్మెల్యేలు తారాప్రసాద్ బాహీణీపతి, గౌరీ శంకర్ మఝి, నర్సింగ్ బోత్ర, రుపుధర్ బోత్ర, రఘురాం మచ్చో, అప్పలస్వామి కద్రక, నీలమాధవ్, మడ్కామి తదితరులు పాల్గొన్నారు.



వేదిక మీద సీఎం మోహన్‌చరణ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు

అలరించిన గుహోరి





భక్తి సంగీతాలాపనలో గాయనీ, గాయకులు

భువనేశ్వర్: పూరీ జగన్నాథుని రథయాత్ర సందర్భంగా కొనసాగుతున్న గుహోరి భక్తి, ఆధ్యాత్మిక సంగీత ఉత్సవం శ్రోతలను మంత్రముగ్దులను చేసింది. స్థానిక ఉత్కళ రంగస్థలంపై ఒడియా భాష, సాహిత్యం, సంస్కృతిశాఖతో కలిసి గురు కేలూ చరణ్ మహాపాత్రో ఒడిస్సీ పరిశోధన కేంద్రం ఈ ఉత్సవం నిర్వహించింది. జగన్నాథుని ఆధారంగా రూపొందించిన గాయకుల భక్తి సంగీత ప్రదర్శన ఉత్సవంలో ప్రేక్షకులను మంత్రముగ్దులను చేసింది. గాయకులు మహాప్రసాద్ కొరా, అనుసూయ నాథ్, బసంత పాత్రో, సృష్టి సురూప, అలోక్ కుందు, నిషి ప్రభ పాణి, ప్రభాత్ కుమార్ పాత్రో, దీప్తి దాస్, దిబ్యరంజన్ దాస్ జగన్నాథునిపై ఆధారిత భుజ తాళే, అహే నీలగిరి, దుఃఖ నాశన హే, ఏహి కతారే మో మన, మొన్నొరే హరి భజన, పతితపావన బన్నా, రాధా శ్రీపాద బ్రజా, జై జగబంధు హే జాదు నందన, జై జై జగన్నాథ్ తదితర భక్తి గీతాలు ఆలపించారు. దుష్మంత్ కుమార్ పరిడా (తబలా), వైభవ కుమార్ దాస్ (డ్రమ్), ప్రీతి రంజన్ స్వంయి (వేణువు), సుధాంశు శేఖర్ జెనా (ఆక్టోపాడ్), చింతామణి మిశ్రా (కీబోర్డ్), సుమంత మహరణ (హార్మోనియం) వాద్య సహకారం అందజేశారు. ప్రముఖ గాయని పద్మశ్రీ శ్యామ మణి దేవి, ఒడిస్సీ నృత్యకారిణి పద్మశ్రీ కుంకుమ్ మహంతి, ప్రఖ్యాత గాయని గీతా పట్నాయక్, ప్రముఖ పండితుడు డాక్టర్ కీర్తన్ నారాయణ్ పఢి, జీకేసీఎం ఒడిస్సీ రీసెర్చ్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనుజా తరిణి మిశ్రా అతిథులుగా పాల్గొన్నారు. కార్యక్రమానికి డాక్టర్ మృత్యుంజయ రథ్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు.



అతిథులకు సత్కారం



గుహోరి సంగీత ఉత్సవంలో వాయిద్యకారుల ప్రదర్శన

అగ్ని ప్రమాదంలో ఇల్లు దగ్ధం

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలోని బోడెమ్మకోవెల సమీపంలో బలగవీధిలో గురువారం ఉదయం అగ్ని ప్రమాదం సంభవించి రూ.1.70 లక్షలు ఆస్తినష్టం సంభవించినట్లు జిల్లా అగ్నిమాపక సహాయాధికారి కె.శ్రీనుబాబు వెల్లడించారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పిందన్నారు. గార మండలం కొర్లాం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్న కుప్పిలి రామామణి బలగవీధిలో పెంకుటిల్లులో కుమారుడు లోకేష్‌తో కలిసి కొంతకాలంగా నివసిస్తున్నారు. లోకేష్ విశాఖలోని ఓ ప్రయివేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం విధుల నిమిత్తం రామామణి కొర్లాం వెళ్లింది. దేవుని గుడిలో ఉన్న దీపం ప్రమిద మంచంపై పడి మంటలు, పొగ వ్యాపించడంతో స్థానికులు ఆందోళనకు గురై ఆర్పేందుకు యత్నించారు. ఈలోగా ఫైర్ సిబ్బంది జీవీకే నాయుడు, ఎస్ ప్రసాద్, ఎం.శ్రీనివాస్, డి.శ్రీనివాస్, పి.జగన్నాథరావు, వై.పాపారావులు వచ్చి మంటలను అదుపు చేశారు. అప్పటికే ఇంట్లో సామాన్లు కాలిపోయాయి.



మంటలను ఆర్పే ప్రయత్నంలో ఫైర్ సిబ్బంది

బీఎంసీ కమిషనర్‌పై దాడికి నిరసన

మల్కన్‌గిరి: మల్కన్‌గిరిలో గురువారం కూడా జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు, ఓఎస్ అధికారులు పెన్‌డౌన్ చేశారు. భువనేశ్వర్‌లో బీఎంసీ కమిషనర్ రత్నకర్ సాహుపై జరిగిన దాడికి నిరసనగా జిల్లా యునిట్ ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అసోసియేషన్ తరపున మద్దతు తెలిపారు. రెండు రోజులుగా ప్రభుత్వ పనులను ఆపివేశారు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దాడిచేసిన వారిపై చర్యలు తీసుకుంటేనే తిరిగి విధులు నిర్వహిస్తామని ఉద్యోగులు స్పష్టం చేశారు. జిల్లా క్లర్క్ సంఘం అధ్యక్షుడు సి.హెచ్.కృష్ణరావు, తదితరులు పాల్గొన్నారు.

బస్సులో వర్షం నీరు

● ప్రయాణికుల అవస్థలు



వర్షం నీటితో తడిచిన సీట్లు

మల్కన్‌గిరి: మల్కన్‌గిరి జిల్లా భలిమెల నుంచి బరంపురం పట్టణానికి నడిచే బస్సు పైకప్పు నుంచి సీట్లపై వర్షం నీరు పడటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారు. ఈ బస్సు ప్రతీరోజు మధ్యాహ్నం 2 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 5 గంటలకు చేరుతుంది. ప్రయాణికులు తడిచి ముద్దవుతున్నారు. గురువారం కూడా బస్సు బయలిదేరినప్పుడు సీట్లు పూర్తిగా తడిచిపోయి ఉండటంతో కండక్టర్‌ను ప్రయాణికులు అడిగితే ఏ మాత్రం పట్టించుకోలేదు. తాము ఏమీ చేయలేమని, పైఅధికారులతో సంప్రదించాలని డ్రైవర్, కండక్టర్ చెప్పారు. రూ.600 టికెట్ కొని నరకయాతన పడి ప్రయాణించాల్సి వచ్చిందన్నారు. ఈ విషయంపై బరంపురం డీటీఎం అరవింద్ మహంతిని వివరణ కోరగా.. బస్సు పైకప్పును బాగు చేస్తామన్నారు. శుక్రవారం నుంచి ఆ బస్సు స్థానంలో మరొక బస్సును పంపుతామన్నారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించిన డ్రైవర్, కండక్టర్‌పై చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుత్ షాక్‌తో భవన నిర్మాణ కార్మికుడు మృతి

ఆమదాలవలస/ఎచ్చెర్ల: ఆమదాలవలస మున్సి పాలిటీ పరిధిలోని చొట్ట వానిపేట కాలనీలో గురువారం విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతిచెంద గా మరొకరు గాయపడ్డారు. స్థానికులు తెలిపి న ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చొట్టవానిపేట కాలనీలో గొర్లె పెంటయ్య ఇంటి నిర్మా ణం జరుగుతోంది. లావేరు మండలం చిన్నమురపాకకు చెందిన గేదెల లక్ష్మణ్(40), మురపాక రమణ రాడ్ బెండింగ్ పనుల కోసం గురువారం వచ్చారు. ఇనుప రాడ్లను భవనంపైకి తీసుకెళ్తుండగా విద్యుత్ తీగలు తగలగడంతో షాక్‌కు గురై కిందపడ్డారు. ఈ ఘటనలో లక్ష్మ ణ్ అక్కడికక్కడే మృతిచెందగా రమణ తీవ్ర గాయాలపాలయ్యాడు. బాధితుడిని 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ట్లు ఆమదాలవలస పోలీసులు తెలిపారు. మృతుడు లక్ష్మణ్‌కు భార్య అసిరితల్లి, ఇద్దరు కుమారులు భాస్కరరావు, బాలరాజు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోవడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

జయపూర్‌లో పట్టపగలు రూ.లక్ష లూటీ

కొరాపుట్: జయపూర్ పట్టణంలో దోపిడీ దొంగలు పట్టపగలు చెలరేగిపోయారు. గురువారం సాయంత్రం బెల్ రోడ్డులో ప్రజలందరూ చూస్తుండగా దోపిడీ చేశారు. హడియా గ్రామానికి చెందిన గిరిజన రైతు కమలోచన్ బోత్ర తనకు ప్రభుత్వం నుంచి అందిన రు.3.9 లక్షల నగదు ఎంజీ రోడ్డులోని షిర్డీ సాయి మందిరం సమీపంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్‌లో డ్రా చేశాడు. తనతో వచ్చిన గిరిజనులతో కలిసి బెల్ రోడ్డు గుండా రాజానగర్ వెళ్లి హడియా గ్రామానికి వెళ్లాలని బయలుదేరాడు. వాహనం బెల్ రోడ్డులో వెళ్తుండగా సొంబారు తోట సమీపంలో పంచముఖ హనుమాన్ విగ్రహ సమీపంలో ముగ్గురు యువకులు రోడ్డుకు అడ్డంగా వచ్చి వాహనం ఆపారు. ఒక యువకుడు బొలిరోలో ఉన్న నగదు సంచి లాగడానికి ప్రయత్నం చేశాడు. అప్పటికే తేరుకున్న కమలోచన్ బోత్ర సంచి గట్టిగా పట్టుకున్నాడు. బొలోరోలో ఉన్న మిగతా గిరిజనులు స్పందించే లోపు రు.లక్ష నగదు (రెండు యాభై వేల కట్టలు) పట్టుకొని పరారయ్యారు. బాధితుడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్‌బీఐలో గిరిజనులు డబ్బులు డ్రా చేసినప్పటి నుంచి దొంగలు అనుసరిస్తున్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.



జయపూర్ పట్టణ పోలీస్ స్టేషన్ వద్ద బాధిత గిరిజనులు

జయపూర్ యువరాజుకి గిరిజనుల కానుకలు

కొరాపుట్: జయపూర్ రాజా నగర్‌లోని మోతిమహల్ కి నందపూర్ నుంచి గిరిజనులు తరలివచ్చారు. యువరాజు విశ్వేశ్వర చంద్ర చుడ్ దేవ్‌కి అటవీ ఉత్పత్తులు బహూకరించారు. తలపాగా కట్టి రాజరిక గౌరవం చేశారు. యువరాజు చంద్ర చుడ్ ఇటీవల నందపూర్ రథయాత్రలో రథ నిర్మాణం కోసం రు.లక్ష విరాళం పంపించారు. అక్కడ జగన్నాథ పూజా కమిటీకి చెందిన ప్రదీప్ దాస్, జగన్నాథ్ పంగి, కాశీనాథ్, భువనేశ్వర్ దళపతి, అజయ్ ఖెముండు తదితరులు వచ్చి ప్రసాదాలు అందిచారు. అనేక దశాబ్దాలుగా మోతీ మహల్ తలుపులు తెరవలేదు. ప్రస్తుత యువరాజు చంద్ర చుడ్ దేవ్ అలహాబాద్‌లో బాల్యం గడిపి ఇటీవలే జయపూర్ సంస్థానానికి తిరిగి వచ్చారు. తమ వంశీయుల సంప్రదాయాలు కొనసాగించడానికి ప్రజలకు సహాయ సహకారాలు ప్రారంభించారు. ఇటీవలే ఆంధ్రా యూనివర్సిటీకి రు.లక్ష పంపించారు.



జయపూర్ యువరాజు చంద్ర చుడ్ దేవ్‌కి రాజ మర్యాదలు చేస్తున్న గిరిజనులు

జాతీయ స్థాయి బూత్ అధికారుల శిక్షణ ప్రారంభం

పర్లాకిమిడి: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశం హాల్‌లో గురువారం జాతీయ స్థాయి బూత్ అధికారుల శిక్షణ శిబిరాన్ని జిల్లా కలెక్టర్ బిజయ కుమార్ దాస్ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ముఖ్యశిక్షాధికారి డాక్టర్ మాయాధర్ సాహు, జిల్లా సంక్షేమ శాఖ అధికారి సాల్మన్ రైకా, జిల్లా సామాజిక సురక్షా అధికారి సంతోష్ కుమార్ నాయక్ తదితరులు హాజరయ్యారు. ఈ శిక్షణ శిబిరంలో 136– మోహానా అసెంబ్లీ నియోజకవర్గంలో బూత్ సంఖ్య 297, 137– పర్లాఖిముండి నియోజికవర్గంలో 276 బూత్‌లు ఉన్నాయి. ఓటరు జాబితాలో కొత్తగా చేరాలనుకున్నావారు ఫారం 6, ఫారం 6(బి) ఓటరు పరిచయ పత్రానికి ఆధార్ అనుసంధానం చేయాలన్నారు. ఫారం 8 ఓటరు జాబితాలో తన పేరు, అడ్రస్ సవరణ చేయాలన్నారు. ఓటర్లు నమోదు చేయడానికి ఓటరు హెల్ప్ లైన్‌లో బూత్ అధికారులకు ఫారం 6, 7, 8, 6(బి)ను అందజేయలన్నారు. ఈ శిక్షణ శిబిరంలో మోహానా అసెంబ్లీ నియోజకవర్గం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



బూత్ అధికారులకు సర్టిఫికెట్లు ప్రధానం చేస్తున్న సంతోష్ నాయక్

మోహన్ సర్కారుకు అగ్ని పరీక్ష

భువనేశ్వర్: రాష్ట్రంలో ప్రభుత్వ కార్యకలాపాల ప్రతిష్టంభన నెలకొంది. అధికారిపై కొందరు నేతలు దాడికి పాల్పడడంపై ప్రభుత్వ అధికారుల ఆగ్రహం చల్లారడం లేదు. ఈ పరిస్థితిని చక్కదిద్దడం ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి సర్కారుకు అగ్ని పరీక్షగా ఎదురైంది. మంత్రుల ఓదార్పు, సానుభూతి చర్యలకు ఓఏఎస్ అధికారులు తలొగ్గకుండా దాడి తెర వెనక వాస్తవ సూత్రధారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రధాన సూత్రధారి అరెస్టు డిమాండ్‌తో ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ అధికారులు సామూహికంగా ఉద్యమిస్తున్నారు. ఈ మేరకు స్థానిక ఠాణాలో పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు దాఖలు చేశారు.

ప్రభావిత ఓఏఎస్ అధికార వర్గం డిమాండ్ మేరకు చర్యలు చేపట్టేందుకు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర శాఖ, ముఖ్యమంత్రి ఎవరి తరహాలో వారు మంత్రులు, కార్యవర్గ సభ్యులు తదితర ప్రముఖులతో ముఖాముఖి చర్చలు జరుపుతున్నారు. బుధవారం నుంచి ఇదే తంతు కొనసాగుతోంది. బీజేపీ రాష్ట్ర శాఖ చేతులెత్తేసింది.

ఏదైనా రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయం తీసుకుంటుందని బహిరంగంగా ప్రకటించి తప్పుకుంది. రాష్ట్ర రెవెన్యూ, విపత్తు నిర్వహణ శాఖ మంత్రి సురేష్ కుమార్ పూజారి, కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పలుకుబడి, పరపతికి అతీతంగా నిందితులు ఎవరైనా వారి వ్యతిరేకంగా చర్యలు తథ్యమని భరోసా ఇస్తున్నారు. మోహన్ చరణ్ మాఝి కొలువులో ఇరువురు ఉప ముఖ్యమంత్రులు కనక వర్ధన్ సింగ్‌దేవ్, ప్రభాతి పరిడా ఇంత వరకు పెదవి కదపలేదు.

ఓఏఎస్ అధికారిపై దాడిలో ప్రధాన సూత్రధారిగా బీజేపీ రాష్ట్ర శాఖ కార్యవర్గ సభ్యుడు జగన్నాథ్ ప్రధాన్‌కు వ్యతిరేకంగా స్థానిక ఠాణాలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు దాఖలైంది. నాలుగు రోజులు గడిచినా ఇంత వరకు చర్యలు తీసుకోలేదు.



ఓఏఎస్ఏ ప్రతినిధి ప్రముఖులతో రెవెన్యు, విపత్తు నిర్వహణ విభాగం మంత్రి సురేష్ కుమార్ పూజారి సమావేశం

3 రోజులే గడువు: ఓఏఎస్ సంఘం


తొలుత 24 గంటల్లో చర్యల్ని ఆశించినా రాష్ట్ర ముఖ్యమంత్రి చొరవ, హామీ పట్ల నమ్మకంతో 3 రోజుల పాటు సహనంతో మెసులుకుని ప్రభుత్వానికి సహకరిస్తామని ఒడిశా అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్ సంఘం (ఓఏఎస్ఏ) చెప్పింది. మంత్రి అభ్యర్థన మేరకు అధికారులు అత్యవసర సేవల కార్యకలాపాల్లో పాల్గొంటున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో అత్యవసర కార్యకలాపాలకు ఏ మాత్రం అంతరాయం లేకుండా నిర్విరామంగా విధులు నిర్వహిస్తున్నారు. పూరీ రథ యాత్రలో దాదాపు 100 మంది అధికారులు కూడా పనిచేస్తున్నారు. ఓఏఎస్ అధికారులకు ముఖ్యమంత్రిపై పూర్తి నమ్మకం ఉందని ఓఏఎస్ఏ ప్రకటించింది.

రాష్ట్ర ముఖ్యమంత్రి సలహాదారు ప్రకాష్ మిశ్రా ప్రస్తుత సంక్లిష్ట పరిస్థితుల్లో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ప్రత్యక్షమయ్యారు. రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు మన్మోహన్ సామల్, జగన్నాథ్ ప్రధాన్ మధ్య బుధవారం రాత్రి సుమారు మూడు గంటలు పైబడి నిర్విరామంగా జరిగిన చర్చల నేపథ్యంలో ప్రకాష్ మిశ్రా సందర్శించినట్లు స్పష్టం అవుతుంది.

వంతెన గోడను ఢీకొట్టిన వ్యాన్

● రోడ్డుపై చెల్లాచెదురుగా పడిన అరటి గెలలు


టెక్కలి రూరల్: బొప్పాయిపురం సమీపంలో జాతీయ రహదారిపై గురువారం వేకువజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యాన్ వంతెన గోడను ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. రావులపాలెం నుంచి ఒడిశా వైపు అరటి గెలల లోడుతో వెళ్తున్న వ్యాన్ టెక్కలి సమీపంలో బొప్పాయిపురం వద్దకు వచ్చేసరికి ఇరుకు వంతెన ఉండటంతో గమనించక వంతెను గోడను బలంగా ఢీకొట్టాడు. ఈ ఘటనలో డ్రైవర్ శాంతన్ శెట్టికి స్వల్ప గాయాలు కాగా.. వ్యాన్ రెండు భాగాలుగా విడిపోవడంతో అరటిగెలలు రోడ్డుపై పడిపోయాయి. సమాచారం అందుకున్న హైవే సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన వ్యక్తిని టెక్కలి జిల్లా ఆస్పకి తరలించారు. అనంతరం ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చేశారు. ఘటనపై టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు.



రోడ్డుపై చెల్లాచెదురుగా పడి ఉన్న అరటి గెలలు

ఎయిర్‌పోర్టు వద్దు.. పచ్చని భూములే ముద్దు

మందస: తమకు ఎయిర్‌పోర్టు వద్దని, పచ్చని భూములే ముద్దు అని మందస మండలం టి.గంగువాడ గ్రామస్తులు తేల్చిచెప్పారు. గ్రామానికి చెందిన చిత్త గున్నయ్య ఆధ్వర్యంలో బాధిత రైతులు కమిటీ హాలులో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు రోజులుగా గ్రామానికి కొందరు అధికారులు వచ్చి సర్వే పేరిట వచ్చి కొలతలు వేయడానికి మిషన్లు తీసుకురావడం బాధాకరమన్నారు. తమ భూములపై ఏ హక్కుతో కొలతలు వేస్తున్నారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే శిరీష స్పందించి తమ భూములను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో దాసరి మోహన్‌రావు, జోగి మోహన్‌రావు, రామారావు, పుక్కల్ల నారాయణ, బాలకృష్ణ, రవి తదితరులు పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

క్లుప్తంగా

బీసీసీఐ అంపైర్ పరీక్షల్లో తోట విజయ్ ఉత్తీర్ణత


బీసీసీఐ అంపైర్ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన తోట విజయ్

విజయనగరం: భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) ఆధ్వర్యంలో గత నెలలో అహమ్మదాబాద్‌లో నిర్వహించిన బీసీసీఐ అంపైర్ల పరీక్షల్లో విజయనగరానికి చెందిన తోట విజయ్ ఉత్తీర్ణత సాధించారు. బీసీసీఐ ఆధ్వర్యంలో నిర్వహించిన అంపైర్ల పరీక్షల్లో జిల్లా చరిత్రలో తోట విజయ్ అంపైర్ సర్టిఫికేషన్ పొందిన తొలి వ్యక్తిగా గుర్తింపు సాధించారు. అంతేకాకుండా, ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి అర్హత పొందిన ఏకైక అభ్యర్థి కూడా ఆయనే. ఆయన సాధించిన విజయం విజయనగరం క్రికెట్‌కు గర్వకారణమే కాకుండా భవిష్యత్ అంపైర్లకు ప్రేరణగా నిలుస్తుంది. ఇప్పటికే విజయ్ అంతర్జాతీయ మ్యాచ్‌లకు స్కోరర్‌గా వ్యవహరిస్తున్నారు. తోట విజయ్ బీసీసీఐ అంపైర్ల పరీక్ష ఉత్తీర్ణత కావడంతో ఇకనుంచి దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లు, రంజీ ట్రోఫీ, ఐపీఎల్, అంతర్‌రాష్ట్ర క్రికెట్ మ్యాచ్‌లకు ఎంపైరింగ్ చేసే అవకాశం లభిస్తుంది. ఈ సందర్భంగా విజయ్‌కు జిల్లా క్రికెట్ అసోసియేషన్, నార్త్ జోన్ క్రికెట్ అకాడమీ ప్రతినిధులు, పలువురు కోచ్‌లు, క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

పీఎం జుగా నిధులతో పాఠశాలలకు భవనాల నిర్మాణం

సాక్షి ఎఫెక్ట్

పార్వతీపురం/మక్కువ: పీఎం జుగా, పీఎం జన్‌మన్ నిధులు మంజూరైన వెంటనే పాఠశాలలకు భవనాలను నిర్మిస్తామని గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకురాలు ఆర్.కృష్ణవేణి తెలిపారు. ఈ మేరకు గురువారం (జూలై 3న) ''సాక్షి'' దినపత్రికలో ''గిరిజన బిడ్డల చదువుల కష్టాలు'' శీర్షికన ప్రచురితమైన కథనం పట్ల ఆమె స్పందిస్తూ మక్కువ మండలంలోని ఎర్ర సామంతులవలస స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో గిరిజన ప్రాథమిక పాఠశాల చిలకమెండంగిలో 8మంది విద్యార్థులు చదువుతున్నారని, రేకుల షెడ్డులో పాఠశాల నిర్వహిస్తున్నారన్నారు. పార్వతీపురం ఐటీడీఏ పరిధిలోని 8 మండలాల్లో 352 పాఠశాలలు ఉన్నాయని, వాటిలో 58గిరిజన ప్రాథమిక పాఠశాలలకు భవనాలు లేనందున పీఎం జుగా, పీఎం జన్‌మన్ కింద పాఠశాలల భవనాల నిర్మాణం కోసం ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఆమె స్పష్టం చేశారు.

వర్షాలకు కూలిన పెంకుటిళ్లు


జామిలో కూలిన పెంకుటిళ్లు

జామి: కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలకేంద్రం జామి లో రెండు పెంకుటిళ్లు గురువారం కూలిపోయాయి. గ్రామానికి చెందిన రాజాన సీతారాం, సీరెడ్డి సింహాచలంల పెంకుటిళ్లు వర్షాలకు నానడంతో కూలిపోయాయని గ్రామస్తులు, బాధితులు తెలిపారు. ఈ ఘటనలో ఎవరికీ ఎటువంటి ప్రమాదం సంభవించలేదు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

తైక్వాండో విజేతలకు సత్కారం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో పాల్గొని సత్తా చాటిన విద్యార్థులను ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్ర గురువారం సత్కరించారు. అనంతపురం జిల్లా, తాడిపత్రిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు సాధించి ఆంధ్రప్రదేశ్ తరఫున ఉత్తరఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో జూన్ 23 నుంచి 25 వరకు జరిగిన జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో అండర్ 25 కిలోల విభాగంలో గోల్డ్ మెడల్ సాధించిన షణ్ముఖ్ సిద్ధార్థ నాయుడు, అండర్ 48 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన బుగత హర్షవర్ధన్, మహిళల విభాగంలో అండర్ 32 కిలోల విభాగంలో సిల్వర్ మెడల్ సాధించిన ఇజ్జాడ వైష్ణవిదేవిలను ఎమ్మెల్యే శాలువాలతో సత్కరించి అభినందనలు తెలియజేశారు.

నిషేధిత పాలిథిన్ కవర్లు వాడొద్దు


తనిఖీలు చేస్తున్న కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతగా భావించాలని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. క్షేత్రస్థాయి పర్యటనల్లో భాగంగా నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఆయన గురువారం పర్యటించి, పారిశుద్ధ్య పరిస్థితులను పరిశీలించారు. అనంతరం పలు దుకాణాలకు వెళ్లి, నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్నదీ లేనిదీ తనిఖీలు చేశారు. నిషేధిత పాలిథిన్, ప్లాస్టిక్‌లతో పర్యావరణానికి ముప్పు ఏర్పడుతుందన్నారు. ఈ నేపథ్యంలో నిషేధిత పాలిథిన్ కవర్లను విక్రయించవద్దని, ఎక్కడైనా విక్రయించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యావ్యాపారం..!

- అడిగినంత ఇస్తేనే సీటు
- బెంబేలెత్తిస్తున్న ఇంటర్ ఫీజులు
- రకరకాల పేర్లతో ప్రైవేట్ కళాశాలల వసూలు
- 105 కళాశాలల్లో 13 వేల మంది ఫస్ట్‌ఇయర్ ప్రవేశాలు



ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల వసూలు ఇలా..	
ఎంపీసీ, బైపీసీ కోర్సులకు :	రూ.35,000 నుంచి 1,50,000
వాహన సౌకర్యం :	రూ.12,000
పుస్తకాలు :	రూ.8,000 నుంచి 10,000
యూనిఫాం (రెండు జతలు) :	రూ.1,600 నుంచి రూ.2,000
వసతి గృహం, భోజన సౌకర్యం :	రూ.6,000 (నెలకు)
ఐఐటీ, ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ :	రూ.50,000 నుంచి 1,00,000
ఏసీ గదికి అదనం :	రూ.12,000

విజయనగరం అర్బన్: ఇంటర్‌మీడియట్ విద్య కోట్ల ఆదాయాన్నిచ్చే వ్యాపారంగా మారింది. జిల్లా కేంద్రంలోను, జిల్లాలోని వివిధ పట్టణాల్లోనూ ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలల యాజమాన్యాలు రకరకాల పేర్లతో విద్యార్థుల నుంచి ఎడాపెడా దోచుకుంటున్నాయి. నీట్, జేఈఈ, ఎంసెట్ ఆశలు రేకెత్తిస్తూ తల్లిదండ్రుల నుంచి ముక్కుపిండి ఫీజుల వసూళ్లకు తెగబడుతున్నారు. బిడ్డల భవిష్యత్తు బాగుంటే చాలని వారు చెప్పిన ఫీజులు చెల్లించిన తల్లిదండ్రులు రెండేళ్ల తరువాత లబోదిబోమంటున్నారు. అటు నీట్, జేఈఈ ర్యాంకులు రాక ఇటు ఇంటర్‌లో మార్కులు లేక మోసపోయామంటూ అధికశాతం కన్నవారు వాపోతున్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులకు డిమాండ్ అధికంగా ఉంటోంది. పదో తరగతి ఫలితాలు రావడమే ఆలస్యం విద్యార్థుల ఇళ్ల ముంగిట వాలిపోతున్న యాజమాన్యాలు ర్యాంకుల పేరుతో ఊదరగొడుతున్నాయి. రూ.లక్షల్లో వసూలు చేసి పెద్ద ఎత్తున ప్రవేశాలు పెంచుకుంటున్నాయి. వసతి గృహాల్లో ఎక్కువ మంది చేరుతుండగా ఇరుకుగదుల్లో కుక్కేస్తున్నారు. ఎక్కువ భాగం సొంతభవనాలు లేకపోయినా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఆటస్థలాలు పూర్తిగా కరువయ్యాయి.

తాయిలాలకు తలొగ్గిన తనిఖీ అధికారులు

జిల్లాలో 18 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, 105 ప్రైవేట్ కళాశాలలో ప్రతి ఏడాది 23 వేల మంది వరకు ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలుంటున్నాయి. ఇందులో ప్రైవేట్ కళాశాలల్లో ప్రతి ఏడాది చేరిన వారు 13 వేల మంది వరకు ఉంటున్నారు. వారి నుంచి ప్రభుత్వం నిర్దేశించిన ఫీజుకంటే ఐదు నుంచి పదిరెట్లకు పైగా వసూలు చేస్తున్నారు. కళాశాలల గుర్తింపు, తరగతుల నిర్వహణ, ఫీజుల వసూళ్లలో పెద్ద ఎత్తున నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. జిల్లా కేంద్రంలోనే రీజనల్ అధికారి కార్యాలయం ఉన్నప్పటికీ అందులోని అధికారులు ప్రైవేట్ కళాశాలల్లో తనిఖీలు చేసిన దాఖలాలు లేవని, ఉత్తుత్తి తనిఖీలతో చేతులు దులుపుకుంటున్నారని ఫిర్యాదులతో పాటు తాయిలాలతో సర్దుబాటు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి.

బట్టీ చదువులతో సరి

నిరంతరం బట్టీ చదువులు తప్పితే ఏ అంశంలోనూ విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికి తీయడంపై కళాశాలల యాజమాన్యాలు దృష్టి సారించడం లేదు. మెటీరియల్ రూపొందించి ఆ అంశాలనే విద్యార్థులతో వల్లెవేయిస్తున్నారు. ప్రాక్టికల్స్ ఊసెత్తడం లేదు. అధ్యాపకుల ఏర్పాటులో వివక్ష చూపుతున్నారు. అందరి నుంచి ఒకే ఫీజు వసూలు చేసినా ఒకట్రెండు బ్యాచ్‌ల విద్యార్థులకు మాత్రమే రూ.లక్షల్లో వేతనాలు చెల్లించి తరగతులు చెప్పిస్తున్నారు.

నిబంధనలు పాటించకుంటే గుర్తింపు రద్దు

ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో ప్రభుత్వ నిబంధనల మేరకే ఫీజులు వసూలు చేయాలి. అందుకు తగిన రసీదులు ఇవ్వాలి. విద్యాశాఖ నిర్దేశించిన ఫీజులకు వ్యతిరేకంగా వసూలు చేస్తే చర్యలు తప్పవు. విశాలమైన భవనాలు, తరగతి గదులు, ల్యాబ్‌లు తప్పక ఉండాలి. ఎటువంటి లోపాలున్నా నోటీసులు ఇచ్చి నిబంధనలు పాటించనివారిపై చర్యలు తీసుకుంటాం. అవసరమైతే కళాశాలల గుర్తింపు రద్దు చేస్తాం.

ఎస్.తవిటినాయుడు, ఆర్ఐఓ, విజయనగరం

ఆర్‌జేడీకి పీఆర్‌టీయూ నాయకుల వినతి


ఆర్‌జేడీ భాస్కరరావుకు వినతిపత్రాన్ని అందిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

పార్వతీపురం: పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలపై రీజనల్ డైరెక్టర్ బి.విజయ్ భాస్కరరావుకు పీఆర్‌టీయూ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు పార్వతీపురం జీజే కళాశాలను ఆర్‌జేడీ సందర్శించిన సందర్భంగా వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ బేసిక్ ప్రైమరీ పాఠశాలలకు విద్యార్థుల సంఖ్యతో ప్రమేయం లేకుండా ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. బదిలీల ప్రక్రియ ముగిసిన తరువాత కూడా పలు పాఠశాలలకు ఉపాధ్యాయులు లేక బోధనకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఆర్‌జేడీని కలిసిన వారిలో ఆ సంఘం నాయకులు వి.తవిటినాయుడు, కె.విజయ్, ఎ.సూర్యనారాయణ, జె.రామినాయుడు, జి.రావినాయుడు, శంకరరావు, తదితరులు ఉన్నారు.

పీఆర్‌టీయూ బలోపేతానికి కృషిచేయాలి

పార్వతీపురం: పీఆర్‌టీయూ బలోపేతానికి ఉపాధ్యాయులు కృషిచేయాలని ఆ సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అమరావు సూర్యనారాయణ ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సమష్టిగా కృషిచేస్తున్నట్లు చెప్పారు. సమస్యల పరిష్కారానికి రాష్ట్ర సంఘం ఆదేశాలమేరకు కార్యక్రమాలు నిర్వహించనున్నామని అందుకు అందరు ఉపాధ్యాయులు సంసిద్ధంగా ఉండాలని కోరారు. సమావేశంలో పార్వతీపురం, కొమరాడ, గరుగుబిల్లి, జియ్యమ్మవలస, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, సీతానగరం మండలాల నుంచి సంఘం సభ్యులు పాల్గొన్నారు.

గంజాయి అక్రమ రవాణా నివారణకు తనిఖీలు

- పలు శాఖల సమన్వయంతో రైళ్లలో సోదాలు
- ఏఎస్పీ అంకిత సురానా


డాగ్ స్క్వాడ్‌తో ప్రయాణికుల లగేజీలను పరిశీలిస్తున్న ఏఎస్పీ అంకిత సురానా

పార్వతీపురం రూరల్: ఒడిశా నుంచి ఆంధ్రప్రదేశ్ మీదుగా ప్రయాణించే రైళ్లలో గురువారం విస్తృత తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పార్వతీపురం టౌన్ రైల్వే స్టేషన్ నుంచి గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో ఈగల్ స్పెషల్ ఫోర్స్, లోకల్ పోలీస్, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, జీఆర్పీ సమన్వయంతో డ్రోన్ కెమెరాలను ఉపయోగించి తనిఖీలు చేపట్టినట్లు పార్వతీపురం ఏఎస్పీ అంకిత సురానా తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణాను నిరోధించడంలో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు స్పష్టం చేశారు. ముందుగా ప్లాట్‌ఫాంపై వేచిఉన్న ప్రయాణికుల లగేజీలను పలు శాఖల పోలీస్ అధికారులతో కలిసి డాగ్ స్క్వాడ్‌తో పరిశీలించారు. అనంతరం గుంటూరు ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌లో బోగీల వారీగా ముమ్మరంగా విజయనగరం వరకు సిబ్బంది తనిఖీలు చేశారు. ఎప్పటికప్పుడు మాదక ద్రవ్యాల నివారణకు ఈగల్ బృందం ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పోలీసు శాఖలో పలు బృందాల సహకారంతో విస్తృతంగా తనిఖీలు చేపటుతున్నట్లు ఏఎస్పీ తెలిపారు. గంజాయి అక్రమ రవాణా, సాగు, వినియోగం లేకుండా చేయడమే ఈగల్ బృందం ప్రధాన లక్ష్యమన్నారు. తనిఖీల్లో క్రైమ్‌స్టేషన్ సీఐ అప్పారావు, పార్వతీపురం రూరల్ సీఐ గోవిందరావు, మరికొంతమంది ఎస్సైలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు డుమ్మా


మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ మంత్రి వంగలపూడి అనిత, మంత్రి కొండపల్లి శ్రీనివాస్

విజయనగరం అర్బన్: కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కలెక్టరేట్‌లో గురువారం నిర్వహించిన 'స్వర్ణాంధ్ర-2047' ప్రణాళిక, పీ-4 కార్యక్రమాల తొలి సమీక్ష సమావేశానికి విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు మినహా మిగిలిన ఐదుగురు ఎమ్మెల్యేలు గైర్హాజరయ్యారు. ఇది అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి వంగలపూడి అనిత మాట్లాడుతూ విజన్ ప్రణాళిక అమలులో ప్రతిఒక్కరూ భాగస్వామ్యులు కావాలని పిలుపునిచ్చారు. రానున్న ఐదేళ్లలో వ్యవసాయంలో రెట్టింపు అభివృద్ధి సాధించాలన్నదే లక్ష్యమన్నారు. మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ ఉద్యాన, వాణిజ్యపంటల సాగుకు రైతులు ఆసక్తిచూపేలా చూడాలన్నారు. సర్వీస్ సెక్టార్ కింద పర్యాటక రంగంలో సన్‌రే రిసార్ట్స్ రూ.150 కోట్లు, జీఎంఆర్ రూ.150 కోట్లు, ఆదాని గ్రూప్ రూ.100 కోట్లతో హోటళ్ల ఏర్పాటుకు ముందుకు వచ్చాయన్నారు. పీ-4లో భాగంగా నియోజకవర్గం పరిధిలోని 264 పోలింగ్ బూత్‌ల నుంచి ఒక్కో కుటుంబాన్ని దత్తత తీసుకుంటానని వెల్లడించారు. సమావేశంలో ఎమ్మెల్సీలు డాక్టర్ గాదె శ్రీనివాసులునాయుడు, రఘురాజు, ఎమ్మెల్యేలు అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, జేసీ సేతుమాధవన్, ఎస్పీ వకుల్ జిందాల్, సీపీఓ బాలాజీ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మహిళలకు శక్తియాప్ రక్షక కవచం

మహిళలకు రక్షక కవచంగా శక్తియాప్ నిలుస్తుందని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం అధికారులతో జరిగిన సమావేశంలో శక్తి యాప్ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎస్పీ వకుల్ జిందాల్ తొలిత శక్తి యాప్ విధి విధానలను పీపీటీలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల, ఆడపిల్లల రక్షణ కోసం రూపొందించిన ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇంతరకు 1.2 కోట్ల మంది వినియోగిస్తున్నారని, ప్రతి మహిళ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పాపం పశువులు


ట్రాక్‌పై మృతిచెందిన పశువులను తరలిస్తున్న రైల్వే సిబ్బంది

పార్వతీపురంటౌన్: పట్టణ రైల్వేస్టేషన్ సమీపంలో గురువారం తెల్లవారుజామున గూడ్స్ ఢీకొని 8 పశువులు మృతిచెందాయి. ఈ సంఘటనపై స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కొమరాడ మండలంలోని పరశురాంపురం గ్రామం నుంచి పార్వతీపురం సంతకు పశువులను తరలిస్తుండగా పార్వతీపురం సమీపంలో గల రైల్వే ట్రాక్ దాటుతున్న క్రమంలో రాయపూర్ పైపు వెళ్తున్న గూడ్స్ ఢీకొనడంతో 8 పశువులు అక్కడికక్కడే మృతిచెందాయి. వెంటనే గూడ్స్‌ను డ్రైవర్ ఆపి రైల్వే సిబ్బందికి సమాచారం అందించారు. తక్షణమే స్పందించిన రైల్వే సిబ్బంది ట్రాక్‌పై ఉన్న పశువులను పక్కకు తొలగించారు. ఈ విషయమై జీఆర్‌పీ సిబ్బందిని వివరాలు అడగ్గా ఎటువంటి ఫిర్యాదు అందక పోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.


ఏటీఎంలో మృతి చెందిన ఆవు

ఏటీఎంలో ఆవు..

రాజాం: పట్టణంలోని బొబ్బిలి జంక్షన్ వద్ద హెచ్‌డీఎఫ్‌సీ ఏటీఎం కేంద్రంలో ఒక ఆవు మృతిచెందింది. రెండురోజుల క్రితమే ఈ ఆవు మృతిచెంది ఉంటుందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. గురువారం ఉదయం ఏటీఎంలో డబ్బులు విత్ డ్రా తీసేందుకు వెళ్లిన బ్యాంకు ఖాతాదారులు విషయాన్ని గుర్తించి, మున్సిపల్ అధికారులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతిచెందిన గోవును పారిశుద్ధ్య కార్మికుల ద్వారా ఏటీఎం కేంద్రంలోంచి బయటకు తీసుకొచ్చి డంపింగ్ యార్డు వద్ద ఖననం చేయించారు. రాజాం రోడ్లపై ఇటీవల ఆవులు అధికంగా సంచరిస్తున్నాయి. వర్షానికి ఏటీఎంలోకి ఆవు చేరి ఉంటుందని, కాలుజారి పడడంతో మృతిచెంది ఉంటుందని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ అనుమానం వ్యక్తం చేశారు.

పాము కాటుతో యువకుడి మృతి

సీతంపేట: మండలంలోని పత్తికగూడ గ్రామానికి చెందిన నిమ్మక కిరణ్ (21) పాముకాటుకు గురై శ్రీకాకుళం రిమ్స్‌లో గురువారం మృతిచెందాడు. ఈ ఘటన వివరాలు పరిశీలిస్తే..శనివారం రాత్రి ఇంట్లో నిద్రిస్తుండగా ఫ్యాన్‌పై నుంచి విషసర్పం కిరణ్‌పై పడడంతో వెంటనే బయటకు విసిరివేశాడు. అప్పటికే పాము కాటు వేయడంతో అపస్మారక స్థితికి వెళ్లిన యువకుడిని స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళంలోని రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు రమ, రాములు గుండెలవిసేలా రోదిస్తున్నారు. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎనిమిది మంది అరెస్ట్


పట్టుబడిన వారితో ఎస్ఐ సన్యాసినాయుడు

డెంకాడ: మండలంలోని అక్కివరం పంచాయతీ, బీబీజీ లేఅవుట్‌లో పేకాట ఆడుతున్న ఎనిమిది మంది జూదరులను పట్టుకుని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు గురువారం తెలిపారు. డెంకాడ ఎస్ఐ, విజయనగరం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడి చేసి, జూదరులను పట్టుకున్నామని వారి నుంచి రూ.15 వేల నగదు, రెండు ఆటోలు, నాలుగు మోటార్‌బైక్‌లు, ఎనిమిది ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఎస్..మేమంటే మేమే..!

- కూటమిలో ముదురు పాకాన పడిన వివాదాలు
- నెల్లిమర్ల నియోజకవర్గంలో ఆధిపత్య పోరు
- జనసేన ఎమ్మెల్యే స్పీడుకు తమ్ముళ్ల బ్రేక్
- వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్న టీడీపీ నేతలు
- ఫైర్‌స్టేషన్ శంకుస్థాపన వాయిదాలో టీడీపీ నాయకుల పాత్ర



పూసపాటిరేగ: నెల్లిమర్ల నియోజక వర్గం కూటమి నేతల్లో ఆధిపత్య పోరుతో ఒకరిపై ఒకరు స్కెచ్‌లు వేసుకుంటున్నారు. నియోజకవర్గం జనసేన ఎమ్మెల్యే స్పీడుకు బ్రేకులు వేయకపోతే టీడీపీ బలహీనపడుతుందనే ఉద్దేశంతో ఆ పార్టీ నాయకులు.. జనసేన పార్టీ పుంజుకోవాలంటే నియోజకవర్గంలో టీడీపీకి చెక్ పెట్టి పార్టీని పటిష్టం చేయాలని ఎమ్మెల్యే లోకమాధవి ఇలా ఒకరిపై ఒకరు స్కెచ్‌లు వేసుకుంటున్నారు. పూసపాటిరేగ మండలంలోని కోనాడ జంక్షన్ సమీపంలో ఫైర్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసేందుకు హోంమంత్రి అనిత నిర్ణయించారు. ఈ విషయం రుచించని టీడీపీ నాయకులు టీడీపీ అధిష్టానం సిఫార్సులతో శంకుస్థాపన కార్యక్రమం వాయిదా వేయించారు. ఇలా జనసేన అవునంటే అంటే టీడీపీ కాదని, టీడీపీ అవునంటే జనసేన కాదన్న చందంగా ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకుని నియోజకవర్గం అభివృద్ధిని గాలికి వదిలేస్తున్నారు. పదిరోజుల క్రితం నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్ల బదిలీలు టీడీపీ నేతల సిఫార్సులతోనే జరిగాయనే చర్చ సాగుతోంది. ఎమ్మెల్యే ఏరికోరి తీసుకువచ్చిన తహసీల్దార్‌లు, డిప్యూటీ తహసీల్దార్‌లను ఏడాది తిరక్కముందే నాలుగు మండలాల నుంచి టీడీపీ నాయకులు బదిలీ చేయించినట్లు సమాచారం. సచివాలయ ఉద్యోగుల బదిలీల్లోను ఇదేవిధంగా జరిగినట్లు తెలుస్తోంది.

నిలిచిపోయిన ఏఎంసీ చైర్మన్ నియామకం

రెండునెలల క్రితం పూసపాటిరేగ ఏఎంసీ చైర్మన్ పదవి జనసేనకు కేటాయించడంతో చైర్మన్ అభ్యర్థి ఎంపికను జనసేన పార్టీ పూర్తి చేసింది. మరికొన్ని రోజుల తరువాత జనసేనకు చెక్‌పెట్టి అధిష్టానం టీడీపీకే చైర్మన్ పదవి కేటాయించినట్లు నెల్లిమర్లలో నియోజకవర్గ టీడీపీ నాయకులు సమావేశం నిర్వహించారు. చైర్మన్ పదవిని బీసీ మహిళకు కేటాయించడంతో ఆశావహుల మధ్య తీవ్రపోటీ నెలకొనగా..వర్గపోరుతో అప్పట్లో చైర్మన్ అభ్యర్థిని ఎంపిక చేయకుండానే సమావేశం వాయిదా వేశారు. నెల్లిమర్ల నగరపంచాయతీలో ఐదు రోజుల క్రితం ఎమ్మెల్యే పాల్గొన్న సర్వసభ్య సమావేశానికి టీడీపీ కౌన్సిలర్‌లు వ్యూహాత్మకంగానే పార్టీ అధిష్టానం ఆదేశాలతో డుమ్మా కొట్టడంతో కోరంలేక సమావేశం వాయిదా పడింది. సంక్షేమ కార్యక్రమాల అమలు, శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు టీడీపీ నాయకులకు సమాచారం ఉండడం లేదని టీడీపీకి చెక్ పెట్టేందుకే ఎమ్మెల్యే యోచిస్తూ అధికారులు సమాచారం ఇవ్వకుండా చేస్తున్నారని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అధిష్టానం ఆదేశాలతోనే టీడీపీ నియోజకవర్గం ఇన్‌చార్జికి జిల్లా మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి అండదండలు పుష్కలంగా ఉన్నట్లు బలంగా ప్రచారం సాగుతోంది. జనసేన ఎమ్మెల్యేకు ఇప్పటికైనా చెక్ పెట్టకపోతే నియోజకవర్గంలో టీడీపీ నిర్వీర్యం అవుతుందని టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు చేయడంతోనే ఎమ్మెల్యేకు చెక్‌పెట్టడానికి ఆదేశాలు వచ్చాయనే ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికైనా ఆధిపత్య పోరును వదిలి నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

చోరీ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష


వకుల్‌జిందల్, ఎస్పీ

విజయనగరం క్రైమ్/రామభద్రపురం: జిల్లాలోని రామభద్రపురం పోలీస్‌స్టేషన్‌లో నమోదైన రెండు చోరీ కేసుల్లో మెంటాడ మండలం పోరాం గ్రామానికి చెందిన ముద్దాయి జోకాడ భగవాన్(22)కు ఐదేళ్ల 10 నెలల జైలుశిక్ష, రూ.8 వేలు జరిమానా విధిస్తూ సాలూరు మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ తీర్పు ఇచ్చారని ఎస్పీ వకుల్ జిందల్ గురువారం తెలిపారు. ఈ కేసుల వివరాల్లోకి వెళ్తే.. 2023లో రామభద్రపురం మండలం ఆరికతోట గ్రామంలో వి.కాంతమ్మ ఇంట్లో వారు నిద్రిస్తున్న సమయం లోను.. 2024లో ఎస్‌బీఐ కస్టమర్ సర్వీస్ పాయింట్ లోను జోకాడ భగవాన్ చొరబడి రూ.లక్షా 60వేల నగదు, తులం చెవిదిద్దులు, ఒక ల్యాప్‌టాప్ దొంగిలించాడు. అప్పట్లో బాధితులు ఇచ్చిన సమాచారంపై రామభద్రపురం పోలీసులు రెండు చోరీ కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో విచారణ చేపట్టిన జడ్జి నేరం రుజువుకావడంతో గురువారం పైవిధంగా జైలుశిక్ష, జరిమానా విధించారు. కాగా జరిమానా చెల్లించని పక్షంలో మరో మూడు మాసాలు సాధారణ జైలుశిక్షను అనుభవించాలని సాలూరు జైఎఫ్‌సీఎం కోర్టు మెజిస్ట్రేట్ హర్షవర్ధన్ తీర్పులో పేర్కొన్నట్లు ఎస్పీ వకుల్ జిందల్ వివరించారు. ఈ కేసులో వాదనలు వినిపించిన పీహెచ్‌కే శర్మ, బొబ్బిలి రూరల్ సీఐ నారాయణరావు, రామభద్రపురం ఎస్సై ప్రసాద్‌లు సకాలంలో కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారని ఎస్పీ ఈ సందర్భంగా చెప్పారు.

రెక్కీ నిర్వహించి హత్య

- మహిళ హత్య కేసు వివరాలు వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి, సీఐ, ఎస్సైలు

బొబ్బిలి: తన భార్య చనిపోవడానికి, బిడ్డ అనారోగ్యంతో ఉండడానికి తన పక్కింట్లో ఉంటున్న పిన్నే కారణమని అనుమానించి రెక్కీ నిర్వహించి మరీ ఆమెను హత్య చేశాడో ఓ యువకుడు. బొబ్బిలి పట్టణంలోని బండారు వీధిలో కరగాని పద్మ అనే మహిళ గాయాలతో బుధవారం ఇంటి గుమ్మం వద్ద పడి మృతి చెందిన ఘటన తెలిసిందే. కాగా ఇది హత్యేనని పోలీసుల దర్యాప్తులో తేలింది. ఈ విషయమై డీఎస్పీ జి.భవ్యారెడ్డి గురువారం రాత్రి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడుతూ మహిళ మృతి చెందడానికి కత్తిపీటపై పడిపోవడమేనని కుటుంబసభ్యులు చెప్పిన మాటలపై నమ్మకం కలగక దర్యాప్తు చేపట్టామన్నారు. వంటిపై గాయాలుండడం, మెడికల్ రిపోర్టు, క్లూస్‌టీమ్ వివరాలను సేకరించి హత్య అని నిర్ధారణకు వచ్చామని డీఎస్పీ చెప్పారు. హత్య చేసింది స్వయానా ఆమె బావ కుమారుడు కరగాని సంతోష్ కుమార్ అని తెలిపారు. సంతోష్ కుమార్ భార్య పావని ప్రసవ సమయంలో చనిపోయింది. అలాగే నెలన్నర రోజుల పసిబిడ్డ ఆరోగ్యం కూడా బాగాలేక ఆస్పత్రిలో చేర్చారు. ఈ రెండు సంఘటనలకు తన పిన్నే కారణమని భావించిన సంతోష్ గురువారం ఉదయం 11 గంటల సమయంలో రెక్కీ నిర్వహించాడు. సాయంత్రం 4.30 గంటల సమయంలో ఇంట్లో పిన్ని ఒంటరిగా ఉన్న సమయంలో పొడిచి హత్యకు పాల్పడినటుల డీఎస్పీ చెప్పారు. మృతదేహాన్ని పోస్ట్‌మార్టం అనంతరం బంధువులకు గురువారం అప్పగించామని, నిందితుడ్ని రిమాండ్ నిమిత్తం తరలించినట్లు తెలిపారు. సమావేశంలో సీఐ కె. సతీష్‌కుమార్, ఎస్సై ఆర్.రమేష్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పోషకాలు లభిస్తాయి

బలిజిపేట: ప్రకృతి వ్యవసాయంలో భాగంగా ప్రీమాన్సూన్ డ్రై షోయింగ్(పీఎండీఎస్)వలన ప్రధాన పంటకు అవసరమైన సూక్ష్మ, స్థూల పోషకాలు భూమికి లభిస్తాయని ఎంసీఆర్‌పీ లక్ష్మి, తిరుపతిరావు రైతులకు అవగాహన కల్పించారు. బర్లి రైతు సేవా కేంద్రంలో బర్లి, మిర్తివలస రైతులకు వ్యవసాయ సాగుపై గురువారం అవగాహన కల్పించి కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏ శ్రీనివాసరావు, యంగ్ ప్రొఫెషన్ రవితేజ, ఏఈవో చాందిని, ఐసీఆర్‌పీ తిరుపతిరావు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం


ప్రమాదంలో బోల్తా పడిన ఆటో

పార్వతీపురం రూరల్: జిల్లా కేంద్రం శివారులో ఓ ప్రైవేట్ పాఠశాల సమీపంలో ఆగి వున్న ఆటోను వెనుక నుంచి వస్తున్న మరో ఆటో ఢీకొట్టడంతో ఆటోలో ఉన్న ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. బలంగా వెనుక నుంచి ఢీకొట్టడంతో ఆటో పల్టీలు కొట్టి రోడ్డు పక్కన ఉన్న తుప్పల్లో పడింది. సినీ పక్కీలో జరిగిన ఈ ప్రమాదం స్థానికులను భయాందోళనకు గురిచేసినప్పటికీ త్రుటిలో ప్రమాదం తప్పి స్వల్ప గాయాలతో ప్రయాణికులు బయటపడ్డారు.